

## అక్రమ ఇసుకపై
# ఉక్కుపాదం

- ఎస్ఐ అర్జున్ రాకతో సంయమనం పాటిస్తున్న అక్రమార్కులు
- రాజకీయ నాయకులకు సైతం హెచ్చరింపులు జారీ
- ప్రభుత్వ ఖజాన దోచుకుంటే ఎవరైనా ఉపేక్షించేది లేదంటున్న ఎస్ఐ

వివరాలు 2లో...

18వ వసంతంలోకి...
నేటి దినపత్రిక
సూర్య
ఎన్టీఆర్ - కృష్ణా
మంగళవారం 1 అక్టోబర్ 2024 పేజీలు 8



# కుటుంబంలో ఒకరికే ఆర్థిక సాయం

- ఈ విషయాన్ని గమనించి, అధికార యంత్రాంగానికి సహకరించాలి
- అనవసరంగా కుటుంబంలో మిగిలిన వారు అర్జీలు దాఖలు చేయొద్దు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.సృజన

వివరాలు 7లో

## మంచి నీరని..
# ముంచేస్తున్నారా..?



- పర్యవేక్షణ లేని వాటర్ ప్లాంట్స్
- ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న వ్యాపారులు
- విచ్చలవిడిగా అనధికారిక వాటర్‌ప్లాంట్లు
- నార్మల్ వాటర్‌నే మినరల్ వాటర్‌గా అమ్మకం
- సరైన అనుమతులుండవ్, పరిశుభ్రత అసలే ఉండదు
- ప్యాకెట్ల నుంచి బాటిళ్ల వరకు ఇదే తీరు
- అక్రమార్కులపై చర్యలు శూన్యం
- మారుమూల గ్రామాల నుంచి నగరాల వరకు ఈ నీళ్లకే అలవాటు పడ్డ జనం
- ఇంటి ఖర్చుల్లో అధిక భాగం మినరల్ వాటర్‌కే..

2

# కుటుంబ ఆదాయం రెట్టింపే ధ్యేయం



- ఆదాయాన్ని పెంచుకునే దిశగా అడుగులు వేద్దాం
- ప్రభుత్వం, సేవా సంస్థలు కలిస్తే మెరుగైన ఉపాధి కల్పించొచ్చు
- కుట్టు మిషన్లు పొందిన వారంతా గ్రూపుగా పని చేసుకోవాలి
- ఆధునిక యంత్రాలపై శిక్షణ పొంది అధిక ఆదాయం పొందాలి
- దండమూడి చౌదరి ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు పంపిణీ చేసిన మంత్రి కొల్లు రవీంద్ర

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ప్రతి కుటుంబ ఆదాయాన్ని పెంచుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పిన మాటల్ని తుచ తప్పకుండా సాధించి తీరుతామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. పెనమలూరు నియోజకవర్గం గండిగుంట గ్రామంలో కృష్ణా జిల్లా తెలుగు యువత అధ్యక్షులు దండమూడి చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించిన కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ప్రజలకు మేలు చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్న ప్రభుత్వానికి స్వచ్ఛంద

మిగతా 2లో...



# శ్రద్ధ వహించండి

## సకాలంలో అర్జీలు పరిష్కరించండి : కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ప్రజల నుండి అందే అర్జీల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ డిఆర్ఓ చంద్రశేఖర రావు తో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక - మీకోసం కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుండి అర్జీలు

7

(మొదటిపేజీ తరువాయి)

## అక్రమ ఇసుకపై ఉక్కుపాదం

**ఎస్ఐ అర్జున్ రాకతో సంయమనం పాటిస్తున్న అక్రమార్కులు**

**రాజకీయ నాయకులకు సైతం హెచ్చరింపులు జారీ**

**ప్రభుత్వ ఖజాన దోచుకుంటే ఎవరైనా ఉపేక్షించేది లేదంటున్న ఎస్ఐ**



**పెనుగంచిప్రోలు, సెప్టెంబర్ 30, మేజర్ న్యూస్ :** మండలంలోని తెల్లవారు ఝామున మూడు గంటలకు అక్రమ ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్థానిక ఎస్ఐ అర్జున్ స్టేషన్ సిబ్బందితో కలిసి చాకచక్యంగా పట్టుకోవడం జరిగింది. ట్రాక్టర్లను, డ్రైవర్లను అదుపులో తీసుకొని స్టేషను తరలించి వారి పై కేసు నమోదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐ అర్జున్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తిని అక్రమంగా ఎవరైనా ఇలా ఇసుకను తరలిస్తే ఉపేక్షించేది లేదన్నారు. అక్రమ ఇసుక తరలింపులో ఎవరైనా రాజకీయ నాయకులు జోక్యం చేసుకుంటే వారి మీద కూడా కేసు నమోదు జరుగుతుందని అన్నారు. అక్రమ ఇసుక రవాణా దారులకు రాజకీయ నాయకులు కొమ్ము కాయొద్దనే హితవు పలికారు. ప్రభుత్వ ఖజానాకి అడ్డదారుల్లో ఇలా దోచుకుంటే సహించేది లేదన్నారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే వారిపై ఉక్కు పాదం ఆపడం జరుగుతుందన్నారు. చట్టపరంగా క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఆస్తికి విఘాతం కలిగిస్తే ఊరుకునేది లేదన్నారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే వారిపై వోల్టా కేసు నమోదు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ ఆదాయం రెట్టింపే ధ్యేయం



సంస్థలు, దాతలు ముందుకొచ్చి సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయం. దండమూడి చౌదరి గతంలో కూడా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారని, ప్రస్తుతం 150 మంది మహిళలకు కుట్టు మిషన్లు అందించడం హర్షణీయం. పేదలకు ఉపాధి కల్పించడం ద్వారానే వారి ఆర్థిక స్థితి గతుల్ని మెరుగు పర్చే అవకాశం ఉంటుంది. అప్పుడే చంద్రబాబు చెప్పిన ఆదాయం రెట్టింపు సాకారమవుతుంది.టైలరింగ్ అంటే చిన్న వృత్తిగా చూసే పరిస్థితి నుండి.. అదే సామ్రాజ్యం అనేలా ఎదగాలని ఆకాంక్షించారు. ఆధునిక యంత్రాల వినియోగం, ఆధునిక పద్ధతుల్లో శిక్షణ పొందడం ద్వారా మెరుగైన ఉపాధి సాధించుకోవడానికి అవకాశం ఉంటుంది. ఇంటర్నెట్లో అనేక శిక్షణా వీడియోలు ఉంటాయని మహిళలు కొంత సమయం కేటాయించి స్కిల్ డెవలప్ చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం పిల్లల యూనిఫాం, రెడీ మేడ్ వస్త్రాల కోసం ఎక్కడో బెంగాళ్, తమిళనాడు లాంటి ప్రాంతాలకు వెళ్తున్నామని.ప్రభుత్వ సహకారంతో ఇక్కడే ఒక యూనిట్ ఎందుకు ఏర్పాటు చేయకూడదు అన్నారు. ఇక్కడ కుట్టు మిషన్లు తీసుకున్న 150 మంది మహిళలు ఏకమై వర్క్ ఆర్డర్లు తెచ్చుకుంటే మీరే పెద్ద ఆర్థిక శక్తిగా మారుతారన్నారు. ప్రభుత్వం నుండి అవసరమైన రుణాలు అందిపుచ్చుకోవాలని సూచించారు. చంద్రబాబు ప్రజల కోసం ఎంతలా ఆలోచిస్తారో మొన్న వరదల సమయంలో ప్రత్యక్షంగా చూశాం. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి.. 11 రోజులు కలెక్టరేట్లోనే ఉండి నిరంతరం సమీక్షించారు. పరిస్థితి మొత్తం మెరుగు పడిన తర్వాతే ఇంటికెళ్లారు. ఇలాంటి ప్రజల మనిషి ఉన్నపుడు మనం ఎందుకు అవకాశాలు. అందిపుచ్చుకోకూడదు? సూపర్ సిక్స్ పథకాలన్నింటినీ అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. దీపావళి నుండి ప్రతి ఇంటికీ మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందించబోతున్నాం. అదే సమయంలో సూపర్ సిక్స్ పథకాలను కూడా అమలు చేసి తీరుతాం. ఇది మంచి ప్రభుత్వమని ప్రతి ఒక్కరూ చెప్పేలా చేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మంచి నీరని ముంచేస్తున్నారా..?

**పర్యవేక్షణ లేని వాటర్ ప్లాంట్స్**

**ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న వ్యాపారులు**

**విచ్చలవిడిగా అనధికారిక వాటర్‌ప్లాంట్లు**

**నార్మల్ వాటర్‌నే మినరల్ వాటర్‌గా అమ్మకం**

**సరైన అనుమతులుండవ్, పరిశుభ్రత అసలే ఉండదు**

**న్యాణ్యతకు నీళ్లొదిలిన వ్యాపారులు.. రూ.కోట్లల్లో వ్యాపారం**

**ఐఎస్ఐ గుర్తింపు లేకున్నా యథేచ్ఛగా విక్రయాలు**

**ప్యాకెట్ల నుంచి బాటిళ్ల వరకు ఇదే తీరు**

**అక్రమార్కులపై చర్యలు శూన్యం**

**మారుమూల గ్రామాల నుంచి నగరాల వరకు ఈ నీళ్లకే అలవాటు పడ్డ జనం**

**ఇంటి ఖర్చులో అధిక భాగం మినరల్ వాటర్‌కే..**

**కృత్తివెన్ను సెప్టెంబర్ 30 మేజర్ న్యూస్ :** నీరు సృష్టిలో ప్రతి జీవరాశికి ప్రాణప్రదమైనది. మంచినీరు లేకపోతే మానవాళి లేదు. ప్రపంచంలో కేవలం 10 శాతం నీరు మాత్రమే తాగేందుకు అనువైనది. మారుతున్న కాలక్రమంలో పెరిగిపోతున్న జనాభా వల్ల మంచినీరు కొరత రోజురోజుకూ పెరిగిపోతోంది. భూగర్భజలాలు అడుగంటడం, నీటి కాలుష్యం పెరిగిపోవడంతో మనుషుల జీవన విధానం, ఆరోగ్యం తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. ఒకప్పుడు పల్లెల్లో బావులు, బోర్ల నుంచి వచ్చే నీటిని, పట్టణాలు, నగరాల్లో కుళాయి నీటిని తాగేవారు. ప్రస్తుత రోజుల్లో ప్రజలు ధనిక, పేద అనే తేడా లేకుండా మినరల్ వాటర్‌ను ఉపయోగించడం మొదలుపెట్టారు.




ప్రజల తాగునీటి అవసరాలను ఆదాయ వనరుగా మార్చుకున్న వ్యాపారులు పుట్టగొడుగుల్లా వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఈ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయల్లా వృద్ధి చెందింది. కాసులకు కక్కుర్తి పడిన వ్యాపారులు కనీస ప్రమాణాలు పాటించకుండా వాటర్‌ప్లాంట్లను నిర్వహిస్తు న్నారు. అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా.. మినరల్ వాటర్ పేరుతో జనరల్ వాటర్ అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. నేతి బీరకాయలో నెయ్యి ఎంత ఉంటుందో.. మనం రోజూ మినరల్ వాటర్ పేరిట తాగుతున్న నీళ్లలోనూ 'మినరల్' అంతే ఉంటుందంటే అతిశయోక్తి కాదు. తద్వారా వ్యాపారులు కోట్లు వెనకేసుకుంటున్నారు.

మినరల్ వాటర్ పేరిట మోసాల దందా జోరుగా సాగుతోంది. మారుమూల పల్లెల నుంచి పెద్దపెద్ద నగరాల వరకు అన్ని చోట్లా మినరల్ వాటరే ఆధిపత్యం సాధించడంతో జనం బావులు, బోరు నీళ్లకు, కుళాయి నీటికీ దాదాపు మంగళం పాడేశారు. తాము తాగేది సాదాసీదా నీరే అయినప్పటికీ మినరల్ వాటర్‌గానే భ్రమిస్తున్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాల వారు తమ ఇంటికి వాటర్ క్యాన్లు రప్పించుకోవడమో, క్యాన్లు తీసుకెళ్లి నీటిని తెచ్చుకోవడమో చేస్తున్నారు. ఇక బయటకు వెళ్లినా బాటిల్ నీళ్లు తాగడానికే మొగ్గు చూపుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని ఈ వాటర్ ప్లాంట్లు ఇబ్బడి ముబ్బడిగా పుట్టుకొస్తున్నాయి.



**కుటుంబ ఖర్చులో మంచి నీటి వాటా...**

నలుగురు సభ్యులున్న కుటుంబం రోజుకు సగటున 20 లీటర్ల వాటర్ క్యాన్‌ను వినియోగిస్తున్నారు. ఆ 20 లీటర్ల వాటర్ క్యాన్ ప్రాంతాన్ని, పోటీని బట్టి ప్లాంట్‌లో రూ.15 నుంచి 30 వరకు విక్రయిస్తున్నారు. అదే డోర్ డెలివరీ చేస్తే అదనంగా మరో రూ.40 నుంచి 50 వరకు వసూలు చేస్తున్నారు. ఇలా ఒక కుటుంబం రోజుకు సగటున 30-40 చొప్పున నెలకు రూ.900-1200 వరకు వెచ్చిస్తుంది. ఇది కాకుండా ఆ కుటుంబంలో ఎవరైనా బయటకు వెళ్లాల్సి వస్తే వాటర్ బాటిల్‌ను కొనుక్కుని తాగుతున్నారు. లీటరు వాటర్ బాటిల్ ఖరీదు రూ.20 ఉంది. ఇలా నెలలో సగటున ఐదారు బాటిళ్లు తాగినా రూ.100 వరకు ఖర్చవుతుంది. అంటే నెలకు రూ.వెయ్యి నుంచి పదిహేను వందలు ఏడాదికి రూ.12 వేలు నుంచి 20వేల వరకు మంచినీళ్లకే చెల్లించాల్సి వస్తోంది. ఇక కార్యాలయాలకు 20 లీటర్ల వాటర్ క్యాన్ రూ.30%-%40కు సరఫరా చేస్తున్నారు. మారిన పరిస్థితుల్లో కూలింగ్ మినరల్ వాటర్ పేరిట కూడా నీటిని అమ్ముతున్నారు. 20 లీటర్ల కూలింగ్ క్యాన్‌కు రూ.40%-%50 వరకు వసూలు చేస్తున్నారు. ఫంక్షన్లలో ఇలాంటి కూలింగ్ వాటర్‌కు ప్రాధాన్యత రోజురోజుకూ పెరుగుతోంది

**పాలతో నీళ్లకు పోటీ..**

రానురాను పరిస్థితి ఎలా తయారైందంటే తాము మంచినీళ్లకు పెట్టే ఖర్చు.. పాల కంటే మించిపోతోందంటే ఆశ్చర్యం కలుగుతుంది. సగటు మధ్య తరగతి కుటుంబాలు మార్కెట్లో రూ.10-15 తక్కువ ధర ఉన్న పాల ప్యాకెట్‌కే మొగ్గు చూపుతాయి. ప్రస్తుతం మార్కెట్‌లో అర లీటరు పాల ప్యాకెట్ ధర వెన్న శాతాన్ని బట్టి రూ.32 నుంచి 37 వరకు ఉంది. ఇలా పాలకు వెచ్చించే సొమ్ము గరిష్ఠంగా రూ.1000 నుంచి1500 అవుతుంది. అంటే పాలతో నీళ్ల ధర పోటీ పడుతోందని స్పష్టమవుతోంది. మనుషుల్లో 'మినరల్ వాటర్'పై మోజుకు ఇది దర్పణం పడుతోంది.

**అధికారుల మధ్య సమన్వయలేమి?**

నిబంధనలు పాటించకుండా నడుస్తున్న వాటర్ ప్లాంట్లను సీజ్ చేసే అధికారం ఆర్డీవోలకే ఉంది. బీఐఎస్, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండి యా(ఎఫ్ఎస్ఎస్ఏఐ) అధికారులకు ప్లాంట్‌లో ఉన్న స్టాకు సీజ్ చేయడానికే అధికారం ఉంది. ఆర్డీవో నుంచి ఆదేశాలొస్తేనే తహసీల్దార్లు, ఆహార తనిఖీ, భద్రత అధికారులు సీజ్ చేస్తారు.



విద్యుత్ కనెక్షన్ ఇచ్చేటప్పుడే ఫుడ్ లైసెన్స్, బీఐఎస్, రెవెన్యూ పర్మిషన్లు ఉన్నాయా? లేదా చూసి ఇవ్వాలి. కానీ అవేమీ చూడకుండానే కనెక్షన్లు ఇచ్చేస్తున్నారు. పైగా ఇలాంటి అనధికారిక వాటర్ ప్లాంట్లపై చర్యలు తీసుకునే విషయంలో సంబంధిత అధికారుల మధ్య సమన్వయం లేదు. ఇవన్నీ వెరసి అనధికారిక వాటర్ ప్లాంట్ల యజమానులకు వరంగా మారింది.

**ఎన్ని వాటర్ ప్లాంట్లు ఉన్నాయో లెక్కలు ఉన్నాయా.?**

వాటర్ ప్లాంట్లు ఎన్ని ఉన్నాయి వాటిలో ఎన్ని అనుమతులు తీసుకున్నారు అనుమతులు లేని వి ఎన్ని అనేది కనీసం అధికారుల వద్ద లెక్కలు కూడా లేవంటేనే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం అవుతుంది. ఒక వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే కనీస నియమాలు పాటించాలి అనే స్పృహ కూడా లేకుండా ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తూ అమ్మకాలు చేపడుతున్నారు. నీటిలో ఉండాల్సిన పారామీటర్స్ ఉన్నాయా లేవా అనేది కూడా కనీసం అధికారులు పరిశీలన చేయకపోవడం శోచనీయం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు వాటర్ ప్లాంట్లను పరిశీలన జరుపుతూ పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# ఇనుప రాడ్డుల కిందపడి డ్రైవర్ మృతి







లారీని క్రేన్ల సహాయంతో బయటకు తీస్తున్న దృశ్యం

లారీ డ్రైవర్ షేక్ ఖాదర్ బాషా మృతదేహం

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

యాచకుడిని ఢీకొని బోల్తా కొట్టిన ఐరన్ లోడు లారీ

యాచకుడు దుర్మరణం

లారీపైన పడుకున్న డ్రైవర్ ఇనుప రాడ్డుల కింద పడి మృతి

**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** 216 జాతీయ రహదారిపై చల్లపల్లి మండలం నూకలవారిపాలెం రోడ్డు వద్ద తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డుపై వెళుతున్న యాచకుడిని ఢీకొని లారీ బోల్తా కొట్టిన ఈ ప్రమాదంలో యాచకుడితోపాటు లారీ డ్రైవర్ మృతిచెందారు. నెల్లూరు జిల్లా కందుకూరుకు చెందిన లారీలో ఇనుప, స్టీలు రాడ్డులను ఒరిస్సా నుంచి చెన్నయ్ తీసుకువెళు తున్నారు. కందుకూరుకు చెందిన లారీ డ్రైవర్ షేక్ ఖాదర్ బాషా(41) లారీని నడుపుతూ తెల్లవారుజామున నిద్రరావటంతో లారీపైన పడుకుని నిద్రిస్తుండగా, క్లీనర్ షేక్ బాబు లారీ నడుపుతున్నాడు. నూకలవారిపాలెం అడ్డ రోడ్డు సమీపంలో జాతీయరహదారిపై వెళుతున్న యాచకుడిని ఢీకొని అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో లారీపైన పడుకుని ఉన్న డ్రైవర్ ఖాదర్ భాషా ఇనుప రాడ్డుల కింద పడి అక్కడికక్కడే మృతిచెందగా, లారీ నడుపుతున్న బాబుకు కాళ్లు విరిగాయి.

లారీ ఢీకొనటంతో యాచకుడు దుర్మరణంపొందాడు. సోమవారం క్రేన్ల సహాయంతో లారీని పైకితీసి ఇనుప రాడ్డుల కింద పడిఉన్న డ్రైవర్ ఖాదర్ భాషా మృతదేహాన్ని బయటకుతీశారు. మృతదేహాలను శవపరీక్షకు అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఖాదర్ బాషా సోదరుని కుమారుడు షేక్ ఫయాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చల్లపల్లి ఎస్ఐ పివిఎస్.సుబ్రహ్మణ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## మన అలవాట్లే మన ఆరోగ్యానికి కారణం

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మన అలవాట్లే మన ఆరోగ్యానికి కారణమని సూర్య న్యూట్రిషన్ వరల్డ్ అధినేత, వెల్నెస్ కోచ్ జయ బ్రహ్మాజీ అన్నారు. స్థానిక గాంధీనగర్ వాకర్స్ భవనంలో ఆదివారం ఉదయపు నడక మిత్రమండలి, మహిళా విభాగం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న జయ బ్రహ్మాజీ అధిక బరువుతో అనర్థాలు, పోషకాహార లోపంతో కలుగు నష్టాలు అనే అంశంపై ప్రసంగించారు. స్థూలకాయం తగ్గించుకోవాలని, మన శరీరానికి తగినంత వ్యాయామం చేయాలని అన్నారు. మినరల్ వాటర్ త్రాగుట వలన కలిగే అనర్థాలను వివరించారు. ఉదయపు నడక మిత్రమండలి అధ్యక్షుడు కారుమూరి రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి జల్లు మురళీనాథ్, కోశాధికారి వేదా లక్ష్మీ నరసింహం, ఉపాధ్యక్షుడు పరిశె వెంకట్రామయ్య, గోళ్ళ ప్రసాద్,మహిళా విభాగం అధ్యక్షురాలు బండి వింధ్యారేఖ, వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వ గవర్నర్ ఆరెపు వెంకటేశ్వరరావు, పూర్వఅధ్యక్షులు పినిశెట్టి మధుసూదనరావు, పెసల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## జన్మదిన సందర్భంగా అన్న క్యాంటీన్ కి విరాళం అందజేత



**జగ్గయ్యపేట,సెప్టెంబర్ 30, మేజర్ న్యూస్ :** పట్టణంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ కు పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సంక వెంకట్రావు, సంక భాస్కర రావు తండ్రి కీర్తిశేషులు సంక జనార్ధన్ రావు 95వ జన్మదిన సందర్భంగా సోమవారం అన్న క్యాంటీన్ కు విరాళంగా 10,000 రూపాయలను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), ప్రముఖ వ్యాపారవేత్త శ్రీరాం రామకృష్ణ చేతుల మీదుగా అన్న క్యాంటీన్ నిర్వాహకులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే అన్న క్యాంటీన్లో భోజనాలు వడ్డించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ కట్టా వెంకట నరసింహారావు, పట్టణ తెలుగుదేశం పార్టీ సెక్రెటరీ మైనేని రాధాకృష్ణ, సంక బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత హోమియో వైద్యశిబిరం



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** చల్లపల్లి వాసవీక్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ మణికంఠ వైద్య సేవలందించారు. 50 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దింటకుర్తి జ్యోతి, సత్యవాణి, కుసుమ, శ్రీదేవి, ద్రోణ పూర్ణచంద్రరావులు పాల్గొన్నారు.

## పేదలకు మెరుగైన వైద్యం అందించాలి



**జగ్గయ్యపేట, సెప్టెంబర్ 30, మేజర్ న్యూస్:** పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి డెవలప్‌మెంట్ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యం అందించాలి అని అన్నారు. వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చే పేదలకు మెరుగైన, నాణ్యమైన వైద్యం అందించడంతో పాటు వారికి అందించే ప్రతి వైద్య సేవలోనూ బాధ్యతగా అన్ని స్థాయిలలో ఆసుపత్రిలో సేవలు అందించాలని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య పేర్కొన్నారు. హాస్పిటల్‌కి కావలసినటువంటి అవసరతలను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం స్థానిక ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ (ఆస్పత్రి)లో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య చైర్మన్ హోదాలో అధ్యక్షత వహించి ఆస్పత్రి అభివృద్ధి సొసైటీ సమావేశాన్ని నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సూపరింటెండెంట్ హరికృష్ణ మెంబర్ కన్వీనర్ హోదాలో అజెండా అంశాలపై కమిటీకి నివేదించారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ సెక్రెటరీ మైనేని రాధాకృష్ణ, హాస్పటల్ డెవలప్మెంట్ మెంబర్స్ యల మంచిలి వెంకట లక్ష్మి, పద్మనాభుని కుటుంబరావు, గుడిసె నాగేశ్వరరావు, హాస్పటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్‌లో 9,500కి పైగా ఉత్పత్తుల ఆవిష్కరణ

**విజయవాడ, మేజర్ న్యూస్ :** అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ 2024 సందర్భంగా, అమెజాన్ యొక్క సెల్లర్ ప్రోగ్రామ్‌లు.. కరిగర్, సహేలీ, లోకల్ షాప్స్, లాంచ్‌ప్యాడ్ లో భాగమైన ఎస్ఎంబిల ద్వారా 9,500 పైగా కంటే ఎక్కువ కొత్త ఉత్పత్తులు ఆవిష్కరించబడ్డాయి. అల్పినో, ఫూల్, ఆజోల్, తాషా క్రాఫ్ట్, ఇతర బ్రాండ్‌లు అమెజాన్ డాట్ ఇన్‌లో తమ ప్రత్యేకమైన ఉత్పత్తులను ప్రదర్శించనున్నాయి. భారతదేశంలోని 100 శాతం సేవ చేయదగిన పిన్ కోడ్‌లలో వినియోగదారులను ఇవి చేరుకుంటాయి. ఇల్లు, వంటగది, కిరాణా, దుస్తులు, మరిన్ని విభాగాల్లో 16 లక్షల మంది విక్రేతల నుండి కోట్లాది ఉత్పత్తులను అమెజాన్ డాట్ ఇన్ అందిస్తుంది.

## గెలాక్సీ ఎస్24 ఎఫ్ఈని విడుదల చేసిన సామ్‌సంగ్




**విజయవాడ, మేజర్ న్యూస్ :** భారతదేశపు అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్, గెలాక్సీ ఎస్ 24 ఎఫ్ఈని విడుదల చేసినట్లు వెల్లడించింది. ఏఐ ఆధారిత ప్రోవిజువల్ ఇంజిన్ శక్తివంతమైన గెలాక్సీ ఎస్24 ఎఫ్ఈ, గెలాక్సీ ఏఐ యొక్క ఫోటో అసిస్ట్ ఫీచర్‌ల ద్వారా ఆధారితమైన మెరుగైన కెమెరా సెటప్‌ను ప్రదర్శిస్తుంది. 6.7 అంగుళాల డైనమిక్ అమోలెడ్ 2ఎక్స్ డిస్‌ప్లే, దీర్ఘకాలిక పనితీరు అందించే 4,700 ఎంఏహెచ్ బ్యాటరీ, శక్తివంతమైన ఎక్సినోస్ 2400 సిరీస్ చిప్‌సెట్‌తో ప్రయాణంలో గేమింగ్స్ కోసం సరైన పరికరంగా నిలుస్తుంది. గెలాక్సీ ఎస్24 ఎఫ్ఈ.. బ్లూ, గ్రాఫైట్, మింట్ అనే మూడు రిఫ్రెష్ రంగుల్లో అందుబాటులో ఉంటుంది. గెలాక్సీ ఎస్24 ఎఫ్ఈ ప్రీ-బుకింగ్స్ ఈ నెల 27 ప్రారంభమయ్యాయి. సామ్‌సంగ్ డాట్ కామ్ తో పాటు ప్రముఖ రిటైల్ స్టోర్‌లలో గెలాక్సీ ఎస్24 ఎఫ్ఈ ని ప్రీ-బుక్ చేసుకోవచ్చు.

## అమెజాన్‌లో ఎన్. గొల్ల రాధమ్మ స్ఫూర్తిదాయక ప్రయాణం



**విజయవాడ, మేజర్ న్యూస్ :** లక్షలాది మంది వినియోగదారులకు వేగంగా, నమ్మదగిన డెలివరీలను అందించేందుకు తెరవెనుక ఉన్న వందల వేల మంది అమెజాన్ ఉద్యోగులు, సహచరులు, భాగస్వాముల అంకితభావమే అని చెప్పవచ్చు. అలా సేవలు అందిస్తున్న వారిలో ఎన్. గొల్ల రాధమ్మ ఒకరు. ఈమె కళ్యాణదుర్గానికి చెందిన 23 ఏళ్ల వినికిడి సమస్యలున్న భాగస్వామి. ఆమె అనుభవాల చేరిక, ప్రాముఖ్యతను, సమానమైన కార్యాలయాన్ని వృద్ధి చేయడంలో సంస్థ నిబద్ధతను ఇది చాటిచెబుతుంది. రాధమ్మ తన ప్రయాణాన్ని రెండున్నరేళ్ల క్రితం బెంగళూరులోని ఒక ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్‌లో ప్రారంభించారు. ఇక్కడ కార్యాచరణ సామర్థ్యం, డైనమిక్ కార్యాచరణ, సురక్షితమైన పని వాతావరణం ఉంటుంది. ఈ కేంద్రాలు అధిక భద్రతా ప్రమాణాలతో, వైకల్యాలున్న వ్యక్తులకు వారి ఉత్తమ సామర్థ్యాన్ని గ్రహించేందుకు, అవసరమైన సాధనాలను, పర్యావరణాన్ని కలిగి ఉండేలా నిర్ధారిస్తూ తగిన మౌలిక సదుపాయాలను దృష్టిలో ఉంచుకుని పలు సదుపాయాలను అందుబాటులోకి తీసుకువస్తూ రూపొందించారు. అసోసియేట్‌గా విధుల్లో చేరిన రాధమ్మ వేగంగా, అక్కడ చేరిన దివ్యాంగులు హార్డ్ ఆఫ్ హియరింగ్ భాగస్వాములకు వారి విధులను నిర్వహించేలా చేయడంలో సహాయపడేందుకు కోచ్, మెంటర్‌గా అదనపు బాధ్యతలు చేపట్టారు. అనేక సవాళ్లను అధిగమించేందుకు కష్టపడి పని చేయడం అనేది విజయానికి కీలకం అనే తన నమ్మకాన్ని బలపరిచిందని రాధమ్మ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## కబేళా, చేపల మార్కెట్లు, మాంసపు దుకాణాలకు సెలవు

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** అక్టోబర్ 2, 2024 గాంధీ జయంతి సందర్భంగా విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఉత్తర్వుల మేరకు 02-10-2024 తేదిన (బుధవారం) నగరంలో ఉన్న కబేళాకు సెలవు ప్రకటించారు. బుధవారం రాత్రి నుండి కబేళాలో ఎటువంటి జంతువులను వధించుటకు అనుమతి లేదు. నగరంలో ఉన్న అన్ని చికెన్ షాపులు, మటన్ షాపులు, చేపల మార్కెట్లు అన్నియు కూడా తెరుచుటకు అనుమతి లేదు. ఎవరైనా అనుమతి లేకుండా జీవాలను వధించిన యెడల, లేదా షాపులను తెరిచియుండి మటన్, చికెన్, చేపలను అమ్మిన యెడల చట్ట ప్రకారం వారిపై చర్యలు తీసుకోనబడునని కమిషనర్ ఆదేశించారు. కావున మటన్, చికెన్, చేపలు హోల్ సేల్, రిటైల్ వ్యాపారస్తులు అన్ని షాపులు మూసి వేయవలెనని ఆదేశించడమైనది.

# పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి







**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మంత్రి కొల్లు రవీంద్ర ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ప్రజలను కోరారు. జిల్లాలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం అమలులో భాగంగా సోమవారం మధ్యాహ్నం మచిలీపట్నం మండలం చినపోతేపల్లి గ్రామంలోని రైతు సేవ కేంద్రం వద్ద జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణపై నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమంలో మంత్రి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీతో కలిసి పాల్గొన్నారు.ఈ క్రమంలో సేకరించిన వివిధ ఎలక్ట్రానిక్ పరికరాల వ్యర్థాలను పరిశీలించారు. ఆయా వ్యర్థాల సేకరణకు 10 మేజర్ పంచాయతీలలో ఏర్పాటు చేయనున్న కియోస్క్ సెంటర్లను మంత్రి కలెక్టర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ నేటి సమాజంలో మనిషి పుట్టుకతోనే ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం పెద్ద ఎత్తున పెరగడం, అదే సమయంలో ఎలక్ట్రానిక్ పరికరాల వ్యర్థాలు పేరుకుపోవడం సర్వసాధారణమైపోయిందని అన్నారు. ప్రతి ఇంటిలోనూ టెలివిజన్లు, వాషింగ్ మిషన్లు, ఫ్రిజ్లు, ఫోన్లు, కంప్యూటర్లు, ఇతర గృహ వినియోగ ఎలక్ట్రానిక్ వస్తువులు కొంతకాలం వినియోగించి పక్కన పడేయటంతో పెద్ద మొత్తంలో ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయని, దీనితో పర్యావరణ సమతుల్యత దెబ్బతిని భవిష్యత్తు తరాల వారి జీవితాలు అగమ్యగోచరంగా తయారయ్యేందుకు అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఎలక్ట్రానిక్ వ్యర్థాలు భూమిలో త్వరితగతిన కలిసిపోయే వస్తువులు కాకపోవడంతో పర్యావరణానికి ముప్పుగా పరిణమించి మానవుని ఆరోగ్యంపై ఎన్నో దుష్ప్రభావాలను కలిగిస్తుందన్నారు. ఈ అనర్థాలన్నిటి నుంచి ప్రకృతిని కాపాడేందుకు ఎలక్ట్రానిక్ పరికరాల వ్యర్థాలను రీసైక్లింగ్ చేపట్టడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా తమ వంతు కృషి చేయాలని సూచించారు.ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోనే తొలిసారిగా కృష్ణా జిల్లాలో ప్రతి ఇంటి నుంచి ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ క్రమంలో రోజువారి సాధారణ చెత్తను సేకరించే రీతిలో ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించేందుకు ప్రస్తుతం కొన్ని పంచాయతీలలో కియోస్క్ సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.రాబోయే రోజుల్లో ప్రతి గ్రామంలో చెత్త నుండి కంపోస్ట్ ఎరువును తయారుచేసి పంచాయతీకి సంపద సమకూరే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పోతేపల్లి గ్రామంలో జువెలరీ పార్క్ కారణంగా భూగర్భ జలాలు కలుషితం అయ్యాయని, త్వరలో నీటి శుద్ధి ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామని, డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరిస్తామన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 11 టన్నులకు పైగా ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించడానికి తీసుకున్న చర్యలపై జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారులను మంత్రి ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించేందుకు జిల్లాలో ఒక మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు.సాంకేతికతో కూడిన నూతన ఆవిష్కరణలు సంభవించినప్పుడు దానితోపాటు ప్రతికూల అంశాలు తయారవుతాయని, కొత్తగా వచ్చిన ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం తర్వాత కొంతకాలానికి పక్కన పడేయడంతో ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పేరుకుపోవడం రానున్న రోజుల్లో పెద్ద సమస్యగా తయారవుతుందని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణపై అనేక ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికీ అమలుకు నోచుకోవడం లేదన్నారు.ప్రతి ఎలక్ట్రానిక్ వస్తువు ఉత్పత్తిదారుడే దాని రీసైక్లింగ్ బాధ్యతను తీసుకోవలసిన అవసరం ఉంటుందన్నారు. ఆ క్రమంలో ఆయా కంపెనీలు రీసైక్లింగ్ కోసం ఏజెన్సీలతో ఒప్పందం కుదుర్చుకొని రీసైక్లింగ్ ప్రక్రియను ప్రారంభించాయన్నారు. జిల్లాలో ఎలక్ట్రానిక్ వ్యర్థాలు సేకరణపై స్పందన బాగుందని, ఒక టన్నులోపు మాత్రమే వస్తుందన్న అంచనాలకు మించి ప్రస్తుతం 11.36 టన్నుల ఎలక్ట్రానిక్ వ్యర్థాలను జిల్లాలోని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల నుంచి సేకరించగలిగామని, ఇది జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ సెక్రెటరీలు, పారిశుద్ధ్య కార్మికుల వల్లనే సాధ్యమైందని వారిని అభినందించారు. జిల్లాలో ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ నిరంతర ప్రక్రియగా కొనసాగేలా ప్రస్తుతం 10 మేజర్ పంచాయతీలలో కియోస్క సెంటర్లను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో మొత్తం 497 గ్రామపంచాయతీలతో పాటు పట్టణ స్థానిక సంస్థలు మచిలీపట్నం, పెడన, గుడివాడ, ఉయ్యూరు, తాడిగడప మున్సిపాలిటీల నుంచి టెలివిజన్లు, కంప్యూటర్లు, కిచెన్ వినియోగ తదితర ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించామని, ఇప్పటివరకు గ్రామ పంచాయతీల నుంచి 9.65 టన్నులు, మున్సిపాలిటీల నుంచి 1.71 టన్నుల ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించినట్లు జిల్లా పంచాయతీ అధికాణి జె అరుణ వివరించారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణకు పోతేపల్లి, అవనిగడ్డ, బాపులపాడు, చల్లపల్లి, మల్లయ్యపాలెం, గుడ్లవల్లేరు, నాగాయలంక, పామర్రు, ఉంగుటూరు, పెదపారుపూడి వంటి పంచాయతీలలో ప్రస్తుతం కియోస్క్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించినందుకు గానూ హోమ్ ల్యాండ్ ఎన్విరో ఇంజనీర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు జిల్లాకు ఎక్సెన్స్ సర్టిఫికెట్ను అందించారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో కన్నమనాయుడు, హోమ్ ల్యాండ్ ఎన్విరో ఇంజనీర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధి సుమన్,, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, కూటమి నాయకులు బండి రామకృష్ణ, కాటం మధు తదితరులు పాల్గొన్నారు.



## జనసేన పార్టీ వీరాభిమాని మణికంఠకు ఘన నివాళులు

**పెడన, మేజర్ న్యూస్ :** గుండెపోటుతో మరణించిన జనసేన పార్టీ వీరాభిమాని జంపన మణికంఠ ఉదయానికి స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నీ మేరకు గూడూరు మండలం కప్పలదొడ్డి గ్రామంలో మణికంఠ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం జంపన మణికంఠ కుటుంబానికి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని మణికంఠ కుటుంబ సభ్యులకు స్థానిక ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పంచకర్ల సురేష్,పోతన స్వామి, దాసరి ఉమా సాయి రాం,కట్ట మునేశ్వర్ రావు, తలుపుల కృష్ణ,ఎన్ ఏ బేగ్, సిరివెళ్ల శ్రీను, పాల్గొన్నారు.

## వరద బాధితులకు దుస్తులు పంపిణీ




**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** పురిటిగడ్డ ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో వరద బాధితులకు దుప్పట్లు, దుస్తులను పంపిణీ చేశారు. బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం పెదలంకకు చెందిన 520మంది వరద బాధితులకు రూ.5.20లక్షల వ్యయంతో దుప్పట్లు, చీరలు, లుంగీలు, టవల్స్ను ఐవీఎం డైరెక్టర్ డా.వేములపల్లి సురేష్ రోజా దంపతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐవీఎం సురేష్ మాట్లాడుతూ, కృష్ణానదికి వచ్చిన భారీ వరదల కారణంగా లంక గ్రామాలు, నదీతీర గ్రామాల ప్రజలు సర్వం కోల్పోయారనీ, ఐవీఎం సంస్థ ద్వారా బాధితులకు తమవంతు సహాయం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేములపల్లి విజయ, పాస్టర్ జాన్పాల్ పాల్గొన్నారు.

# కొత్తగా పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలి

**గన్నవరం, సెప్టెంబర్ 30, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్య ఎన్నికల అధికారి సూచనల మేరకు 71-గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, కృష్ణాజిల్లా సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ షేక్ షహీద్ బాబు ఆద్వర్యంలో ఈరోజు ఉదయం గన్నవరం తహశీల్దార్ కార్యాలయంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ 2025లో భాగంగా పోలింగ్ కేంద్రముల హేతుబద్ధీకరణ అంశం మీద నియోజకవర్గ స్థాయి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ గన్నవరం నియోజక వర్గంలో ఎన్నికల నాటికి నియోజకవర్గం లో 2,79,054 మంది ఓటర్లు ఉన్నారని నేటికి నియోజకవర్గం లోని 4 మండలాలకు సంబంధించి 2,79,141 మంది ఓటర్లుగా నమోదై ఉన్నారని విజయవాడ రూరల్ మండలం 88,846, గన్నవరం మండలంలో 74,433, బాపులపాడు మండలంలో 72,025, ఉంగుటూరు మండలంలో 43,837 మంది ఓటర్లుగా నమోదై వున్నారని తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న గన్నవరం నియోజకవర్గ టిడిపి పోల్ మేనేజిమెంట్ కోఆర్డినేటర్, ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు మాట్లాడుతూ,బాపులపాడు మండలం ‘రంగయ్య అప్పారావు పేట గ్రామపంచాయతీకి సంబందించిన 610 మంది ఓటర్లు దానికి 5కిమీ దూరంలో ఉన్న కాకులపాడు పోలింగ్ స్టేషన్ నెంబర్లు 238,239 లో ప్రస్తుతం నమోదై వుండటం వలన పోలింగ్ సమయంలో ఓటు వేయటానికి 5కిమీలు దూరంలో వృద్ధులు, మహిళలు, గ్రామస్తులు, చాలా ఇబ్బందులు పడుచున్నారని ఈవిషయాన్ని గతంలో ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్ళామని,ప్రస్తుతం పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణలోభాగంగా కాకులపాడు గ్రామం నుంచి రంగయ్య అప్పారావుపేటకు సంబందించిన 610మంది



ఓటర్లకురంగయ్య అప్పారావుపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు.. అట్లాగే విజయవాడ రూరల్ మండలం ప్రసాదం పాడు పోలింగ్ స్టేషన్ నెం. 51 లో 888 మంది ఓటర్లు సంబందించిన పోలింగ్ స్టేషన్ ప్రస్తుతం నేషనల్ హైవే ప్రక్కన ఉన్నదని ఓటర్లందరు దీనికి 3కిమీ దూరంలో రైల్వేట్రాక్ అవతల ఉండటం వలన పోలింగ్ సమయంలో చాలా ఇబ్బందులు పడుచున్నారని,దీనికి ప్రత్యామ్నాయంగా రైల్వే ట్రాక్కు అవతల ప్రక్కనే పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని,ఎన్నికల నమోదు అధికారికి విజ్ఞప్తి చేసి ఈమేరకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో వ్రాసిన వినతి పత్రాన్ని గన్నవరం తహశీల్దార్ కె.వెంకట శివయ్యకు అందచేశారు. అట్లాగే కృష్ణా గుంటూరు పట్టభద్రుల శాసన సభ నియోజకవర్గానికి సంబందించి నోటిఫికేషన్ విడులలైనందున దీనికి సంబందించి నియోజకవర్గ స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించాలని రాజకీయ పార్టీ ప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమావేశంలో గన్నవరం తహశీల్దార్ కె.వెంకట శివయ్య వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు నాదెళ్ళ మోహన్, (బిజెపి) తంగిరాల శ్రీనివాస్ (టిడిపి) ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ ఎఎస్ఆర్ గోపాలరెడ్డి, గన్నవరం డిప్యూటి తహశీల్దార్ భవాని తదితరులు పాల్గొన్నారు.



## వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్యాటన

**జగ్గయ్యపేట,సెప్టెంబర్ 30, మేజర్ న్యూస్ :** పట్టణంలో వైస్సార్సిపి నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం వారి స్వగృహం వద్ద ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు అవగాహన కార్యక్రమాన్ని నియోజకవర్గ ముఖ్య నాయకులతో ఎమ్మెల్సీ అభ్యర్థి పూనూరి గౌతమ్ రెడ్డితో సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఈ యొక్క సమావేశానికి నియోజకవర్గ ముఖ్య నాయకులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, కౌన్సిలర్స్, సర్పంచులు,ఎంపిటిసిలు,మండల అధ్యక్షులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు హాజరు కాగలరు అని తెలియజేశారు.

# ఆర్డీఓ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు



**నందిగామ, సెప్టెంబర్ 30, మేజర్ న్యూస్:** తొలగించిన మధ్యాహ్న భోజన కార్మికులును విధుల్లోకి తీసుకోవాలని నందిగామ ఆర్డీవో కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు సోమవారం ప్రారంభించారు. పిచ్చిక మీద బ్రహ్మాస్త్రం లాగా రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులు పై రాజకీయ కక్ష సాధింపు చేస్తున్నట్లు పలువురు తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కే గోపాల్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు గత 23 సంవత్సరాలుగా ప్రైమరీ,అప్పర్ ప్రైమరీ,హైస్కూల్స్ విద్యార్థిని, విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం ఆహారాన్ని వండిపెడుతున్నారు. వీరంతా బడుగు, బలహీన వర్గాలకు చెందిన మహిళలే. కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. మౌలిక సదుపాయాలు సక్రమంగా లేకపోయినా,ప్రభుత్వం నుండి బిల్లులు సకాలంలో రాకపోయినా అప్పులు తెచ్చి ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతూ వంట చేసి పెడుతున్నారు. అనేక సంవత్సరాలుగా దీనినే నమ్ముకుని జీవిస్తున్నారు. అయితే నూతన ప్రభుత్వం వచ్చిన తర్వాత నందిగామ రెవెన్యూ డివిజన్ పరిధిలోని వివిధ మండలాల్లో ప్రస్తుతం పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులను, శానిటేషన్ వర్కర్లను,వాచ్మెన్లను పని నుండి బలవంతంగా తొలగిస్తున్నారు. వారు తమ విధులను సక్రమంగా నిర్వహిస్తున్నప్పటికీ,వారిపై ఎలాంటి రిమార్కులు లేకపోయినప్పటికీ అనేక సంవత్సరాలుగా ఇబ్బందులకోర్చి పని చేస్తున్న కార్మికులను రాజకీయ కారణాలతో తొలగిస్తున్నారు. ఇప్పటికే నందిగామ రెవెన్యూ డివిజన్ పరిధిలోని నందిగామ మండలం లింగాలపాడు జిల్లా పరిషత్,ఎంపీపీ స్కూల్లో 23 సంవత్సరాలుగా పనిచేస్తున్న నలుగురు మధ్యాహ్న భోజన పథకం కార్మికులు,ముగ్గురు శానిటేషన్ వర్కర్లను,అప్పర్ ప్రైమరీ స్కూల్లో ఇద్దరిని, చందర్లపాడు మండలం ముప్పాళ్ళ యం.పి.యుపి స్కూల్లో ఇద్దరిని, పెనుగంచిప్రోలు మండలం సుబ్బాయగూడెం యం.పి.యుపి స్కూల్లో ఇద్దరిని,అనిగండ్లపాడు జిల్లా పరిషత్ స్కూల్లో నలుగురిని, వీరులపాడు మండలం జుజ్జూరు జిల్లా పరిషత్ హైస్కూల్ ముగ్గురు మధ్యాహ్న పథక పథకం కార్మికులు,ఒక వాచ్మెన్ను అక్రమంగా తొలగించారు. ఇంకా అనేక చోట్ల తొలగిస్తామని బెదిరిస్తున్నారు. రాజకీయ నాయకుల ఒత్తిడులకు లొంగి కార్మికులను తొలగించడం అన్యాయం. కావున ప్రస్తుతం పనిచేస్తున్న వారెవరినీ రాజకీయ కారణాలతో తొలగించకుండా యధాతథంగా కొనసాగించేలా తమరు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేయుచున్నాము. ఇదే పద్ధతి కొనసాగితే కార్మికులందరినీ ఐక్యం చేసి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు కూడా సిద్ధమవుతామని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు గోపి నాయక్, మధ్యాహ్నం భోజన కార్మికులు వేల్పుల ఏసోబు, కళావతి, సత్యవతి, పుల్లయ్య,శ్యామ్, ప్రసాద్,కార్మికులు పాల్గొన్నారు.

# మీకోసం కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులకు ప్రథమ ప్రాధాన్యత

## జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ప్రజల సమస్యలను స్పష్టంగా తెలుసుకొని వాటిని చట్టపరిధిలో విచారించి న్యాయం అందించడానికి కృష్ణా జిల్లా పోలీస్ శాఖ సిద్ధంగా ఉంటుందని సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు అన్నారు. ఈరోజు మీకోసం కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి, వారి సమస్యను విని, సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేసి, వారి సమస్యను పరిష్కరించాలని సూచించారు. అంతేకాక సబ్ డివిజన్ పరిధిలో సర్కిల్ పరిధిలో, స్టేషన్ పరిధిలో కూడా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించాలని, వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడి వారి సమస్యలను పూర్తిగా విని చట్ట పరిధిలో సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులకు సిబ్బంది సహాయం చేసి ప్రశాంతంగా తమ సమస్యను వివరించడానికి సహాయం చేశారు. సమస్య తీవ్రత ఎలా ఉన్నా చట్ట పరిధిలో పూర్తిస్థాయి విచారణ జరిపి నిర్ణీత గడువు లోపల పరిష్కారం అందించడానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉంటామని, సమస్యను గూర్చి చింతించకుండా ధైర్యంగా వచ్చి ఫిర్యాదు చేసి పరిష్కారం పొందవచ్చని ఎస్పీ ఫిర్యాదుదారులకు భరోసా కల్పించారు. ఈరోజు మొత్తం ఫిర్యాదులలో మచిలీపట్నం నుండి ఒక వివాహిత వచ్చి తనకు వివాహ సమయంలో తల్లిదండ్రులు కట్నంగా ఇచ్చిన వ్యవసాయ భూమిని తన పేరు రిజిస్ట్రేషన్



చేయడానికి తన అన్నదమ్ములు అడ్డుగా నిలుస్తున్నారని, అదేమని అడుగుతుంటే భౌతిక దాడికి పాల్పడుతున్నారని న్యాయం చేయమని ఫిర్యాదు చేశారు. తోట్ల వల్లూరు నుండి ఒక యువకుడు వచ్చి తాను ఇంజనీరింగ్ పూర్తి చేసి ఉద్యోగ అన్వేషణ లో ఉండగా తమ దగ్గర బంధువులు ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి రెండు లక్షల రూపాయలు తీసుకున్నారని, ఉద్యోగం గురించి అడుగుతుంటే సమాధానం చెప్పకపోగా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నాడని న్యాయం చేయమని ఫిర్యాదు చేశారు.

# మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం



**పెడన, మేజర్ న్యూస్:** పురపాలక సంఘు సాధారణ కౌన్సిల్ సమావేశం చైర్ పర్సన్ కటకం నాగకుమారి ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ మేరకు ఎజెండాలో 9 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో ప్రతిపక్ష జనసేన కౌన్సిల్ సభ్యురాలు మట్టా శివ పావని మరో సభ్యుడు పిచిక సతీష్ లు తమ వార్డుల్లో కుక్కలు పందులు తో పాటు ఆవులు కూడా స్వైర విహారం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంతోకాలంగా కుక్కలను నిర్మూలించాలని కోరుతున్నప్పటికీ ఫలితం ఉండటం లేదని వారు ఆరోపించారు. మనుషుల ప్రాణాలతో మున్సిపల్ అధికారులు చెలగాటం ఆడుతున్నారని కూడా అన్నారు. తమ వార్డులో పారిశుద్ధ్యం ఘోరంగా ఉందని పావని అన్నారు. వీరి ఆందోళనకు సమాధానం ఇచ్చిన కమిషనర్ గోపాలరావు మాట్లాడుతూ కుక్కల నిర్మూలనకు గతంలో అనేక చర్యలు తీసుకున్నామని అయితే వీటిని నిర్మూలించడం నేరమని ప్రభుత్వం పది సంవత్సరాల క్రితం చట్టం చేయడంతో పరిస్థితులు మారిపోయాయి అని చెబుతూ జీవహింస చట్టరీత్యా నేరమని అన్నారు. సంతాన ఉత్పత్తి లేకుండా చేయటమే ప్రస్తుతం మన ముందు ఉన్న మార్గమని తెలిపారు. కొన్ని పురపాలకు సంఘాల్లో వీటికి ఆపరేషన్ చేసే కేంద్రాలు ఉన్నాయని వాటికి ఉపయోగించుకుని సంతాన ఉత్పత్తి పెరగకుండా చూసుకోవడమే మార్గం అని తెలిపారు. వైస్ చైర్మన్ కాజా మాట్లాడుతూ తామర చెరువు గట్లను పటిష్టం చేయవలసిన అవసరం ఉందన్నారు. భారీ వర్షాలు పడినప్పుడు చెరువు లోని నీరు ఇళ్లల్లోకి ప్రవేశిస్తుందని తెలిపారు. దీనికి మరో సభ్యుడు కటకం ప్రసాద్ సమాధానం ఇస్తూ పట్టణంలోని అన్ని చెరువులను సర్వే చేయాల్సి ఉందన్నారు. ఆ తర్వాతనే గట్లను పటిష్టం చేస్తే ఫలితాలు ఉంటాయని తెలిపారు. బంటుమిల్లి రోడ్డులో ఏర్పాటు చేసిన ఎస్ స్మార్ట్ బయట పడవేస్తున్న చెత్తను తొలగించేందుకు ప్రత్యేకంగా వారికి పన్ను విధించాలని కటకం సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు పురపాలక సంఘు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## గ్రాడ్యుయేట్ల ఎమ్మెల్సీ ఓట్లు నమోదు చేసుకోవాలి

**అవనిగడ్డ మేజర్‌న్యూస్ :** ఎం.ఎల్.సి ఓట్లు నమోదు ప్రక్రియను నియోజకవర్గ యువనాయకులు గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి రాజా ప్రారంభించి గ్రాడ్యుయేట్లు ప్రతి ఒక్కరూ ఎం.ఎల్.సి ఓట్లు నమోదు చేయించుకోవాలని కోరారు. సోమవారం శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ కార్యాలయంలో ఎం.ఎల్.సి ఓట్లు నమోదు కార్యక్రమాన్ని రాజా ప్రారంభించి తన ఓటు నమోదు ధరఖాస్తును నియోజకవర్గ ఎం.ఎల్.సి ఓట్ల నమోదు పరిశీలకులు రావి సూర్య కిరణ్ తేజ కు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఓట్ల నమోదు పరిశీలకులు వెంకట్ ముళ్ళపూడి, రాయపాటి శ్రీనివాసరావు, రావి రత్నగిరి, కోనేరు చంద్రమౌళి, చల్లపల్లి వైస్ ఎం.పి.పి మోర్ల రాంబాబు, కూటమి నేతలు ఘంటశాల రాజమోహన్‌రావు (కన్నయ్య), ముళ్ళపూడి శ్రీను, భోగిరెడ్డి బుజ్జిబాబు, గుడివాక నరహరి, కోట సాయి, తండు గంగాధర్‌లతో పాటు పలువురు పాల్గోన్నారు.

## హిందు దేవాలయాల విధులలో అన్యమతస్తులను తొలగించాలి



**అవనిగడ్డ మేజర్‌న్యూస్ :** హిందు దేవాలయాల విధులలో ఉన్న అన్య మతస్తులను తొలగించాలని వెంకటేశ్వర స్వామి భక్త బృందం డిమాండ్ చేస్తున్నారు. తిరుపతి లడ్డుల కల్తీల పై, హిందు దేవాలయాల విధుల్లో అన్యమతస్తులను తొలగించాలని హిందు దేవాలయాల పరిరక్షణ బాధ్యత పవన్ కళ్యాణ్ చేస్తున్న ఉద్యమానికి సంఘీభావంగా అక్టోబర్ 3 వ తేది గురువారం మధ్యాహ్నం 3 గంటలకు వెంకటేశ్వర స్వామి వారి నామ సంకీర్తనతో అవనిగడ్డ వంతెన సెంటర్‌లో గల ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవాలయం నుండి పులిగడ్డ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయం వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో పువ్వాడ శ్రీ వేణుగోపాలస్వామి వారి సేవాశ్రమ అధిపతులు మొవ్వ రఘుశేఖర ప్రసాద్, హిందు దార్మిక సంఘాలు పాల్గోంటున్నాయని కావున అన్నీ వర్గాల వారు ఈ వెంకటేశ్వర స్వామి వారి నామ సంకీర్తనలో పెద్ద ఎత్తున పాల్గోని జయప్రదం చేయాలని వెంకటేశ్వర స్వామి భక్త బృందం సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మొవ్వ రఘుశేఖర ప్రసాద్‌ను పూల మాలతో ఘనంగా సత్కరించారు.

## మురుగు కాలువల పక్కన ఉన్న మట్టి తొలగింపు



**అవనిగడ్డ మేజర్‌న్యూస్ :** పంచాయితీ పరిధిలోని మురుగు కాలువల పక్కన ఉన్న మట్టిని తొలగించేందుకు శ్రీకారం చుట్టారు. శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ ఆదేశాల మేరకు ఇటివల కొంత కాలంగా డ్రైనేజిలోని పూడిక తీత పనులను ఈఓపిఆర్‌డి కమ్మి బాల సుందరి పర్యవేక్షణలో తీసి మురుగు కాలువల పక్కన పోయ్యగా ఆ మట్టిని సోమవారం పంచాయితీ కార్యదర్శి తోట శ్రీనివాసరావు ఆద్వర్యంలో తరలింపు చర్యలు చేపట్టారు

# పదవీ విరమణ పొందుతున్న ఇద్దరు పోలీసు అధికారులకు ఆత్మీయ వీడ్కోలు



మచిలీపట్నం మేజర్ న్యూస్ : పదవి విరమణ చెందుతున్న పోలీస్ సిబ్బంది పి బాలకృష్ణారావు టి వెంకటేశ్వర్రావు సుదీర్ఘకాలం పాటు పోలీసు శాఖలో నిజాయితీగా, నిబద్ధతతో పని చేసి, ఆరోగ్యంగా పదవి విరమణ పొందడం చాలా అదృష్టం అని దానికి ఆ భగవంతునికి రుణపడి ఉండాలని జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర రావుఅన్నారు. ఈరోజు జిల్లా పోలీసు కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో పదవి విరమణ పొందుతున్న సిబ్బందికి జిల్లా ఎస్పీ ఇతర పోలీసు అధికారులతో కలిసి ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. ముందుగా సిబ్బం ది సతీసమేతంగా సత్కరించి, వారి కుటుంబ సభ్యుల ఆనందోత్సాహాల నడుమ పోలీస్ అధికారులతో కలిసి పూలమాలలు వేసి, దుశ్శాలువాలతో సత్కరించారు. పోలీస్ శాఖ లో వారు చేసిన సేవలను గురించి మరొకసారి నెమరువేసుకుంటూ ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మీ అందరూ పోలీస్ శాఖ నుండి బయటకు వెళుతున్నందుకు బాధగా ఉందని, వృత్తి బాధ్యతలలో విరమణ అనే ది సహజమని, మీరు మీ విధి నిర్వహణలో కనపరి చిన సమయస్ఫూర్తిని ఇతర విలువైన అంశాలను ఆదర్శంగా తీసుకొని ప్రతి సిబ్బంది వారి యొక్క విధులు నిర్వహిస్తారని ఆశిస్తున్నాను అన్నారు. అంతేకాకుండా మీరు ఇంత నిబద్ధత గా విధులు నిర్వర్తించారు అంటే దాని వెనక మీ కుటుంబ సభ్యుల తోడ్పాటు ఎంతో ఉందని, వారి తోడ్పాటు వల్లనే మీరు ఇంత విజయవంతంగా మీ సర్వీసును పూర్తి చేశారని తెలుపుతూ మీకు ఏ సమస్య ఉన్నా మీకు ఏ సహాయం కావాలన్నా నన్ను నేరుగా సంప్రదించవచ్చని, పోలీస్ శాఖ యొక్క తలుపులు ఎప్పుడు మీ కోసం తెరిచే ఉంటాయని మీకు సహాయం అందించడానికి పోలీస్ శాఖ సిద్ధంగా ఉందని తెలిపి మిగిలిన మీ జీవితాన్ని దైవ దర్శనాలకు విహార యాత్రలకు కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపడానికి కేటాయిస్తూ,ఆరోగ్యంపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

## బాల శివశంకర్ భగవాన్‌కు ప్రత్యేక పూజలు



అవనిగడ్డ మేజర్ న్యూస్ : బాలశివశంకర్ భగవాన్‌కు ప్రత్యేక పూజలు, అర్చనలు, అ భిషేకాలు నిర్వహించి స్వామి వారిని విశేషంగా అలంకరించారు. మండల పరిధిలోని దక్షిణ చిరువోల్లంక మోపిదేవి మండల పరిధిలోని కోసూరువారిపాలెం కృష్ణా నదీ నడుమ వెలసిన బాలశివశంకర భగవాన్‌కు క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, బాధ్రపదమాసం, బహుళపక్షం త్రయోదశి తిథిని పురస్కరించుకుని సోమవారం ఆలయ నిర్వాహకురాలు గుడిసేవ విజయలక్ష్మీ స్వామి వారికి నవవిధ అభిషేకాలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. ముం దుగా స్వామి వారిని కృష్ణానదీజలాలతో అభిషేకించారు. ఆలయ అర్చకులు కాశీభట్ల సుబ్బయ్య శాస్త్రి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు గోత్రనామాలతో పూజలు నిర్వహించి కర్పూర హారతులు సమర్పించారు. ఈ సందర్భంగా దివిసీమ నుండే కాకుండా జిల్లా నలుమూలల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆలయ ఆవరణలో గల గణపతి కుమారస్వామి విగ్రహాలకు పూజలు నిర్వహించి నాగేంద్రస్వామి వారి పుట్టలో పాలు పోసి పూలు, పండ్లతో పూజలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు కావలసిన ఏర్పాట్లను ఆలయ నిర్వాహకురాలు గుడిసేవ విజయలక్ష్మీ స్వయంగా పర్యవేక్షించారు.

## రోడ్డు ప్రమాదంలో చిట్టిబాబుకు తీవ్ర గాయాలు



అవనిగడ్డ మేజర్‌న్యూస్ : తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు పాలైయ్యారు. ఆదివారం రా త్రి గుంటూరు జిల్లా వైపు నుండి అవనిగడ్డకు కారులో వస్తున్న యాసం చిట్టి బాబు భట్టిప్రోలు అడ్డరోడ్డు నుండి ప్రధాన రహదారిపైకి దూసుకువచ్చిన ట్రాక్టర్ ఢీ కొనడంతో కారు నుజ్జునుజ్జు కాగా, సకాలంలో ఎయిర్ బ్యాగ్స్ తెరచుకోవడంతో చిట్టిబాబు ప్రాణాలతో భయటపడ్డాడు. స్థానికులు హుటా హుటీనా రేపల్లె ఆసుపత్రికి తరలించి చికిత్స అందించి ఇంటికి చేర్చారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ యువనాయకులు గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి రాజాతో పాటు నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున పలు పార్టీలకు చెందిన నేతలు, కృష్ణా, గుంటూరు జిల్లాల నుండి టిడిపి నేతలు పెద్ద ఎత్తున తరలివచ్చి పరామర్శించి రోడ్డు ప్రమాధానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

## మహమ్మద్ ఇలియాస్ కిడ్నీ బాధితునికి రూ.50వేల సాయం



చల్లపల్లి, మేజర్ న్యూస్ : రెండు కిడ్నీలు పాడైపోయి కిడ్నీ సమస్యలతో చికిత్స పొందు తున్న చల్లపల్లికి చెందిన నిరుపేద ముస్లిం అబ్దుల్ సుభాన్‌కు హైదరాబాద్ కు చెందిన మహమ్మద్ ఎహియా రూ.50వేలు ఆర్థిక సహా యం అందించారు. చల్లపల్లి గ్రామానికి చెందిన ఎహియా హైదరాబాదు లోస్థిరపడ్డారు. తండ్రి మహమ్మద్ ఇలియాస్ ద్వారా విషయం తెలుసుకుని తనవంతు సాయంగా తండ్రి ఇలియాస్ ద్వారా సుభానీకి సాయం అందించారు.

## ఎమ్మెల్యే సౌమ్యని కలిసిన సబ్ రిజిస్టర్



నందిగామ, సెప్టెంబర్ 30, మేజర్ న్యూస్: పట్టణంలోని కాకాని నగర్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ను నందిగామ సబ్ రిజిస్టర్ ఖాజా దుర్గారాణి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో సబ్ రిజిస్టర్ కార్యాలయ సిబ్బంది, పలువురు టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే యార్లగడ్డను మర్యాదపూర్వకంగా కలిసిన ఈవో

గన్నవరం, సెప్టెంబర్ 30, మేజర్ న్యూస్ : విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వెంకమ్మ పేరంటాలు అమ్మవారి దేవస్థానము కు నూతన ఈవో గా పి.ప్రియాంక బాధ్యతలు స్వీకరించిన అనంతరం గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ను విజయవాడ లోని క్యాంప్ కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కు ఈవో శాలువా తో సత్కరించి మొక్క ను అందచేశారు. అక్టోబర్ 3 వ తేదీ నుండి 12 వ తేదీ వరకు దేవస్థానం లో అంగరంగ వైభవంగా నిర్వహించే దసరా మహోత్సవములకు సంబందించిన ఆహ్వాన పత్రిక ను ఎమ్మెల్యే కు అందచేసి ఆహ్వానించారు. అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లేని అమ్మవారి మహోత్సవాలు సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో మిరమిట్లు కొలిపే విద్యుత్ కాంతులతో, బాణాసంచా కాల్పులతో శరన్నవరాత్రులు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఈవో తెలిపారు. శరన్నవరాత్రులలో అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చన, చండీ హోమం లు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొల్లా ఆనంద్, అద్దేపల్లి సాంబశివ, నాగరాజు, కొండయ్య, పట్టపు చంటి, కొంగన రవి, కల్లెపల్లి సాయి రామ రాజు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు



పెడన,మేజర్ న్యూస్ : "స్వచ్చత హీ సేవ-2024" కార్యక్రమంలో భాగంగా పెడన పట్టణం అర్బన్ హెల్త్ సెంటర్‌లో పారిశుధ్య కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు "వైద్య శిబిరం" నిర్వహించి ఆరోగ్య పరీక్షలు చేశామని అనంతరం మందులు అందజేయుట జరిగిందని మున్సిపల్ చైర్ పర్సన్ కటకం నాగ కుమారి ప్రసాద్, కమిషనర్ ఎం గోపాల్ రావు తెలిపారు. ఈ సందర్భంగా కటకం మాట్లాడుతూ తెల్లవారేసరికి పట్టణమంతా పరిశుభ్రంగా ఉంచి పారిశుద్ధ కార్మికుల ఆరోగ్యాన్ని కూడా వారు కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో 21వార్డు కౌన్సిలర్ పిచ్చుక సతీష్ బాబు, అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ కె. ప్రీతి పటేల్, ఏ ఎన్ ఎం లు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొనడం జరిగింది.

## చుక్కలన్నింటిన నిత్యావసర సరుకుల ధరలు



జగ్గయ్యపేట, సెప్టెంబర్ 30 మేజర్ న్యూస్ : మండలంలో ఉన్న చిల్లకల్లు గ్రామం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రభుత్వ ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో సామాజిక కార్యకర్త మేటికల శ్రీనివాసరావు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్లో ప్రజలు ఉపయోగించే నిత్య అవసరాల సరుకులు,కూరగాయల ధరలు పెరగడంతో పేద, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం దసరా పండుగ కావడంతో పిల్లలు,చుట్టాలు ఇండ్లకు వచ్చి పండుగ చేసుకుంటారు. నిత్యవసరాల ధరలు పెరగడంతో పేదలు నిత్యవసరాలు కొన్నాలాంటే అప్పులు పాలౌతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిత్యవసరాలు, కూరగాయల పెరుగుతున్న ధరలను నియంత్రించే చర్యలు తీసుకొని ప్రజలకు అందుబాటు ధరలలో ఉంచాలి.అదేవిధంగా ప్రస్తుతం దసరా సందర్భంగా నిత్యావసర సరుకులను ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా అందించాలని తమరి ద్వారా ప్రభుత్వాని కోరుతున్నాము. ఇదేకాకుండా వరద భాధితులు జగ్గయ్యపేట ఆర్.టీ.సి కాలనీ, పలు ప్రాంతాలలో ప్రజలకు నిత్యావసర సరుకులను తక్షణమే అందించాలని తమరిని కోరుతున్నాము.తక్షణమే ప్రభుత్వ సంస్థలలో పనిచేస్తున్న తాత్కాలిక,రోజువారీ ఉద్యోగస్తులకు పెండింగ్ లేకుండా దసరా సందర్భంగా జీతాలు అందించాలి అని ఆయన కోరారు.

## పౌష్టికాహారాన్ని అందించండి



కృత్తివెన్ను సెప్టెంబర్ 30 మేజర్ న్యూస్ : చిన్నారులకు గర్భిణీ స్త్రీలకు బాలింతలకు పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా అందించాలని సిడిపిఒ సముద్రవేణి ఆదేశించారు. సోమవారం లక్ష్మి పురం సెక్టార్ పరిధిలో పౌష్టికాహారం మాసోత్సవం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలలో రక్తహీనత రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. చిరుధాన్యాలు, ఆకుకూరలు కూరగాయలు తదితర పౌష్టికాహారానికి సంబంధించిన వాటిని తీసుకోనే విధంగా అంగన్వాడి కార్యకర్తలు పని చేయాలని తెలిపారు. హెల్త్ ఎడ్యుకేటర్ బి ప్రభావతి మాట్లాడుతూ ఎప్పటికప్పుడు వైద్యులు సూచించే విధంగా మందులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ రాఘవమ్మ, హెల్త్ సూపర్వైజర్ పద్మ, ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అమ్రిత సాయిలో ముగిసిన ఫాకల్టీ డెవలప్మెంట్




**నందిగామ,సెప్టెంబర్ 30 మేజర్ న్యూస్ :** అమ్రిత సాయి ఇంజనీరింగ్ కళాశాల లో సి ఎస్ ఈ విభాగం ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన ఫాకల్టీ డెవలప్మెంట్ కార్యక్రమం ముగింపు రోజు పురస్కరించుకొని ముఖ్య అతిథి గా టెక్ మహేంద్ర సౌత్ ఇండియా హెచ్.ఆర్ హెడ్ శ్రీనివాస రెడ్డి విచ్చేసారని సెక్రటరీ, కరెస్పాండంట్ కె. రామ మోహన్ రావు తెలిపారు. ఈ సందర్భం గా ఏర్పాటు చేసిన కార్యక్రమం లో రామ మోహన్ రావు మాట్లాడుతూ ఈ ఫాకల్టీ డెవలప్మెంట్ కార్యక్రమం ద్వారా పలు ఇంజనీరింగ్ కళాశాల నుండి అధ్యాపకులు పాల్గొని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పై అవగాహన పెంపొందించుకోవడానికి దోహదపడుతుందన్నారు విద్యార్థులను నూతన ఆవిష్కరణల పై దృష్టి సారించే విధంగా తయారుచేయడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్ మాట్లాడుతూ ఈ 6 రోజుల పాటు జరిగిన ఎఫ్ డి పి ని ఏ ఐ సి టి ఈ-ఏ టి ఏ ఎల్ సహకారంతో నిర్వహించామని స్పష్టం చేశారు. అధ్యాపకుల కు ఇటువంటి కార్యక్రమాలు బాగా ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ముఖ్య అతిధి గా పాల్గొన్న శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం వినియోగంలో ఉన్న లేటెస్ట్ ట్రెండ్స్ గురించి ఫాకల్టీ డెవలప్మెంట్ కార్యక్రమానికి హాజరైన అధ్యాపకులకు కూలంకుశం గా విశదీకరించారు. అంతే కాకుండా ఇండస్ట్రీ లో అవసరమయ్యే సాంకేతికతను విద్యార్థులకు ఏ విధంగా బోధించాలి అనే అంశం పై అవగాహన కల్పించారు. తద్వారా అధ్యాపకులు అప్డేట్ అవటం తో పాటు తమ విద్యార్థులను సైతం రీసెర్చ్, డెవలప్మెంట్ లో భాగస్తులుగా చేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమం లో ఎఫ్ డి పి కోర్డినేటర్ డాక్టర్ జి విజయ్ కుమార్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ పి. చిరంజీవి,అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ డాక్టర్. శ్రీదేవి, ఎఫ్ డి పి కో - కోర్డినేటర్ కె సుభాష్ చంద్ర అన్ని విభాగాధిపతులు,అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రద్ధ వహించండి



(మొదటిపేజీ తరువాయి)

స్వీకరించారు. మొత్తం 140 అర్జీలు జిల్లా యంత్రాంగం స్వీకరించింది. అందులో కొన్నింటి అర్జీల వివరాలు ఇలా ఉన్నాయి. గూడూరు మండలం మల్లవోలు గ్రామానికి చెందిన బండారు వెంకట శ్రీనివాసరావు తనకు రీ సర్వే నంబర్ 295-1 డ్యాన్స్ ఒకటిలో 108.5 చదరపు గజాల్లో నివేశన స్థలం కలదని ఆ స్థలం వెనుక సరిహద్దుదారులు అయిన దేసు రంగారావుతో సరిహద్దు సమస్య ఏర్పడి చాలా ఇబ్బందులు పడుతున్నామని గతంలో మూడుసార్లు సర్వే కోసం అర్జీ ఇచ్చామని ఇకనైనా తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ అందజేశారు. మండల కేంద్రమైన నాగాయలంక తూర్పు బజారు చెందిన ప్రజలు టి రవిబాబు, ఉప్పల శ్రీనివాసరావు, టీవీ శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ ట్రాక్టర్లతో, ధాన్యము వరిగడ్డి తోలుకొనుటకు విశాలమైన రోడ్డు ఉండేదని, ఒక రెవిన్యూ ఉద్యోగి రేకుల షెడ్డు నిర్మించుకొని రోడ్డును ఆక్రమించారని దాన్ని తొలగించాలని ఫిర్యాదు చేశారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం, రైతు సంఘం కృష్ణా జిల్లా కమిటీల జిల్లా కార్యదర్శులు పి. రంగారావు, గౌరీశెట్టి నాగేశ్వరరావు ప్రతినిధులు కే శివ నాగేశ్వరరావు, లక్ష్మణరావు తదితరులు మాట్లాడుతూ ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాలు సంభవించిన వరదల కారణంగా దెబ్బతిన్న రైతులు, కౌలు రైతులను ఆదుకోవాలన్నారు. ముఖ్యంగా వరికి ఎకరానికి 25 వేల రూపాయల నష్టపరిహారం అందించాలని, కంద,పసుపు తదితర వాణిజ్య పంటలకు లక్ష రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని, భూమి స్వభావంతో సంబంధం లేకుండా ప్రతి పంటను ఈ క్రాప్ నమోదు చేయాలని, నష్టపరిహారం అందించాలని, పాడైపోయిన మోటార్లను ఆయిల్ ఇంజిన్ లను ట్రాక్టర్లను ఉచితంగా మరమ్మతు చేయించాలని ఇసుక మేట వేసిన భూములను ప్రభుత్వమే బాగు చేయించాలని, రెండవ పంట వేసుకొనుటకు మినుము, మొక్కజొన్న విత్తనాలను ఉచితంగా సరఫరా చేయాలని, జే ఎల్ జి, ఆర్ఎం జి, సిసిఆర్సి రుణాలను రద్దు చేయాలని, డ్వాక్రా మహిళల రుణాలను కనీసం 3 నెలలపాటు మారిటోరియం విధించాలని కోరుతూ అర్జీ అందజేశారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి మీకోసం అర్జీలు, ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చిన అర్జీలు, కోర్టు కేసులను సమీక్షించారు. మొత్తం 3,841 అర్జీలు రాగా ఇప్పటివరకు 627 అర్జీలు ఇంకా పెండింగ్లో ఉన్నాయన్నారు. గడువు దాటిన అర్జీలు 11 ఉన్నాయని, వాటిలో రెవెన్యూ 5, పోలీస్ 5, జలవనరుల శాఖ ఒకటి గ్రామ వార్డు సచివాలయాలు ఒకటి పెండింగ్లో ఉన్నాయన్నారు. వాటన్నిటిని తక్షణమే పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చిన అర్జీలలో డీఎస్ఓ 4 డిపిఓ 3 ఇంకా పెండింగ్లో ఉన్నాయని వాటిని కూడా తక్షణమే పరిష్కరించాలన్నారు అక్టోబర్ 1 వ తేదీన మంగళవారం పింఛన్ల పంపిణీ కోసం ముందుగానే బ్యాంకుల నుండి డబ్బులు డ్రా చేసుకున్నారా లేదా, పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయా లేదా అని డిపిఓను కలెక్టర్ విచారించారు. కోర్టు కేసులకు సంబంధించి 4 వకాలత్ దాఖలు చేయాలని ఆర్డబ్ల్యూఎస్, మున్సిపల్ అధికారులు వెంటనే కౌంటర్లు దాఖలు చేయాలన్నారు జలవనరుల శాఖ అధికారులు కౌంటర్లు దాఖలు చేయడంలో నిర్లక్ష్యంగా. వ్యవహరిస్తున్నారని జిల్లా కలెక్టర్ ను బాధ్యులుగా చేసి కోర్టుకు హాజరయ్యే పరిస్థితి తీసుకోని వచ్చే పక్షంలో ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కె ఆర్ ఆర్ సి ఎస్ డి సి జి శ్రీదేవి, డిఎస్ఓ పార్వతి, డిఎంహెచ్వో డాక్టర్ గీతా బాయి, జెడ్పిసిఈఓ కె కన్నమ నాయుడు డిపిఓ అరుణ, డీఈవో తహేరా సుల్తానా, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ పద్మావతి, సిపిఓ గణేష్, డి టి డబ్ల్యూ ధూర్జటి ఫణి, జిల్లా ఉద్యాన అధికారి జే జ్యోతి పిడి విజయలక్ష్మి మున్సిపల్ కమిషనర్ బాపిరాజు తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కుటుంబంలో ఒకరికే ఆర్థిక సాయం

**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 30, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ముంపు ప్రభావిత బాధితులకు కుటుంబం యూనిట్గా ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని, కుటుంబంలో ఒకరిని గుర్తించి, వారి ఆధార్కు అనుసంధానమైన బ్యాంకు ఖాతాలో డీబీటీ ద్వారా నగదు జమచేయడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ డా. జి.సృజన సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కుటుంబంలో మరో వ్యక్తిని లబ్ధిదారునిగా గుర్తించడానికి వీలు లేని విషయాన్ని గుర్తించాలని, అనవసరంగా అర్జీలు దాఖలు చేయొద్దని సూచించారు. బాధితులకు అత్యంత పారదర్శకంగా సహాయం అందించడం జరుగుతోందని, ఇప్పటివరకు ఇళ్ళు, వాహనాలు తదితర నష్టాలకు సంబంధించి 1,12,481 మంది బ్యాంకు ఖాతాల్లో సాయం జమచేయడం జరిగిందన్నారు.

**ఆధార్ తో బ్యాంక్ ఖాతా అనుసంధానించుకోండి...**

ఎన్యూమరేషన్ జరిగి, గుర్తించిన లబ్ధిదారులందరికీ ప్రభుత్వం పరిహారం మంజూరు చేసిందని అయితే ఆధార్తో బ్యాంకు ఖాతా లింక్ కాకపోవడం, బ్యాంకు ఖాతా వినియోగంలో లేకపోవడం తదితర కారణాల వల్ల దాదాపు 20 వేల మంది ఖాతాల్లో నగదు జమకాలేదని వివరించారు. ఈ విషయాన్ని ఎస్ఎంఎస్ ద్వారా లబ్ధిదారుల ఫోన్ లకు సమాచారం యిచ్చామన్నారు .అందువల్ల సత్వరమే ఆధార్కు బ్యాంకు ఖాతాను అనుసంధానం చేసుకొని వినియోగంలోకి తెచ్చుకోవాలని సూచించారు. ఈ విషయమై బ్యాంకులకు కూడా సూచనలిచ్చామని,సచివాలయ సిబ్బంది కూడా బాధితులకు సహకారం అందిస్తారని తెలిపారు. అర్హత పొందిన లబ్ధిదారుల జాబితాలు సచివాలయాలు, తహసీల్దార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయని.. అక్కడ పేర్లు ఉండి ఇంకా పరిహారం జమ కాకపోతే ఆధార్తో బ్యాంకు ఖాతా అనుసంధానం కాలేదని గుర్తించి, బ్యాంకు ఖాతాను ఆధార్



తో లింక్ చేసుకోవాలని సూచించారు. ఆధార్ తో అనుసంధానం అయిన రెండు రోజుల లోపు ఖాతాలో పరిహారం జమచేయడం జరుగుతుందని, ఎలాంటి ఆందోళనా చెందాల్సిన అవసరం లేదని, ఎవరూ ఎక్కడకూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని సూచించారు. అదేవిధంగా పరిహారం కోరుతూ గ్రీవెన్స్ లో సమర్పించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి రెండు మూడు రోజుల్లోనే పరిష్కరించి ఆపై అర్హులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ సృజన పేర్కొన్నారు.

## దసరా మహోత్సవాల కరపత్రం విడుదల



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం చమ్మన గిరిపేట గాంధీ బొమ్మ శివాలయంలో వేంచేసి ఉన్న శ్రీ మహిషాసుర మర్దని సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారి దేవాలయంలో దసరా మహోత్సవాలు సందర్భంగా జరుగు కార్యక్రమాల వివరాలుతో కూడిన కరపత్రాన్ని నేడు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తుమ్మన రాధాకృష్ణమూర్తి,సెక్రటరీ ఎండూరి సురేష్,ట్రెజరర్ చేబ్రోలు గాయత్రి, ఆలయ ప్రధాన అర్చకులు చేబ్రోలు బాబి,అర్చకులు కందుకూరి చిట్టిబాబు,సాయి చరణ్ శర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ వారు మాట్లాడుతూ దసరా నవరాత్రుల్లో ప్రతిరోజు ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు హోమాలు జరుగుతాయని సాయంత్రం లలితా సహస్ర పారాయణం మొదలగు కార్యక్రమాలు నిర్వహిస్తామని కావున భక్తులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరుతున్నారు.

## ఎంపిడిఓ ఏంజిల్ విజయకుమార్ పదవి విరమణ



**నూజివీడు, మేజర్ న్యూస్:** నూజివీడు ఎంపిడిఓ ఏంజిల్ విజయకుమార్ సోమవారం తన విదుల నుండి ఉద్యోగ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో నూజివీడు ఎంపిపి ఆరేపల్లి శిరీష, జెడ్పీ వైస్ ఛైర్మన్ గుడిమేళ్ల కృష్ణంరాజు, నూజివీడు మండల స్పెషల్ ఆఫీసర్ ఎస్.రామమోహన్, ఇంచార్జీ తహశీల్దార్ సుబ్బారావు, అగ్రికల్చర్ అధికారిణి ఏ.చాముండేశ్వరి, హార్టీకల్చర్ అధికారిణి ఆర్.హేమ లు ఎంపిడిఓ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపిడిఓ అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ కొనియాడారు. ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని దీవించారు. ఈ కార్యక్రమంలో ఇతర మండల స్థాయి అధికారులు, ఈఓపిఆర్డి సరస్వతి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 15 ఫిర్యాదులు



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్ లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 15 ఫిర్యాదులు అందినట్లు కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ వచ్చిన ప్రతి ఫిర్యాదును ఖచ్చితంగా పరిష్కరించేటట్టు చూసుకోవాలని అవసరమైతే ఇతర శాఖల సమన్వయంతో సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సచివాలయం స్థాయిలో ప్రతి సచివాలయంలో సెక్రెటరీ సెలవు పెట్టిన, ఇన్చార్జి సెక్రటరీ ఏర్పాటు చేసి, ప్రజలు తీసుకొచ్చిన ప్రతి ఫిర్యాదును పరిష్కరించేటట్టు చర్యలు తీసుకొని సచివాలయం స్థాయిలో కూడా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును ఆన్లైన్లో దరఖాస్తు చేస్తూ, సంతృప్తికరమైన పరిష్కారం ఇచ్చిన తర్వాతే ఆ ఫిర్యాదును ఆన్లైన్లో క్లోజ్ చేస్తున్నామని తెలిపారు. ఈ సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అనధికార ఆక్రమణలు, డ్వాక్రా సంఘాల సమస్య, రోడ్డు, డ్రైనేజీ సమస్యలపై ఫిర్యాదులు అందుకని సత్వర, సంతృప్తికరమైన పరిష్కారాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అత్యధికంగా పట్టణ ప్రణాళిక కు 10, ఇంజినీరింగ్ 3, రెవెన్యూ, యుసిడి సంబంధిత ఒక్క ఫిర్యాదు అందుకున్నారు. మొత్తంగా ఈ సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 15 ఫిర్యాదులు అధికారులు స్వీకరించారు.



# కాలుష్య రహిత సమాజానికై అవగాహన






## కమిషనర్ ధ్యానచంద్ర

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో సోమవారం ఉదయం స్వచ్ఛత గురించి ప్రజలకు మరింత అవగాహన కల్పించేలా సెల్ఫీ పాయింట్స్ ఏర్పాటు చేశారు. అందులో భాగంగా మారీస్ స్టెల్లా కాలేజ్ వద్ద షాపర్స్ స్టాప్ మాల్, గురునానక్ కాలనీ లోని ఉషోదయ సూపర్ మార్కెట్ వద్ద, పంట కాలవ రోడ్డు దగ్గర నారాయణ స్కూల్, వన్ టౌన్ గాంధీజీ హై స్కూల్, విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం వద్ద సెల్ఫీ స్టాండ్లను ఏర్పాటు చేశారు. ఈ సెల్ఫీ స్టాండ్ ల ద్వారా ప్రజలు సెల్ఫీ దిగడమే కాకుండా స్వచ్ఛత వైపు వారి మద్దతుని చాటి చెప్పారు వారి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచటమే కాకుండా విజయవాడ నగరాన్ని పరిశుభ్రత వైపు ముందడుగులు వేస్తూ స్వచ్ఛ సర్వేక్షన్ లో ప్రథమ స్థానం ప్రథమ స్థానం కైవసం చేసుకునేలా వారి మద్దతు ఇచ్చారు. నాలుగవ డివిజన్, శ్రీనివాసనగర్, బ్యాంక్ కాలనీలో ప్రజలకు స్వచ్ఛత హీసేవ కార్యక్రమం గురించి అవగాహన కల్పించేందుకు కళా జాతర బృందం చే ప్రజలకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఈ బృందం ప్రజలకు అర్థమయ్యే రీతిలో కళ ద్వారా నాట్యమాడుతూ బుర్రకథ చెబుతూ, పరిసరాల పరిశుభ్రత, సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధం, స్వచ్ఛత, కాలుష్యాన్ని తగ్గించటం, ప్రజలు చేయవలసిన పనులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పర్యావరణ పరిరక్షణకై మొక్కలు నాటడం ఇలాంటి విషయాలపై నాటకం ద్వారా నాట్యం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ జానకిరామ్, సానిటరీ సెక్రటరీలు, స్వచ్ఛ సర్వేక్షన్ సిబ్బంది, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు

## అక్టోబర్ మూడు నుండి 12వ తేదీ వరకు ప్రతిరోజు అమ్మవర్లకు దివ్యాలంకారాలు

## సాయంత్రం సంగీత నృత్య కార్యక్రమాలు





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** స్థానిక అజాద్ రోడ్ లోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో శరన్నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు పాలకవర్గ అధ్యక్ష కార్యదర్శులు మామిడి మురళీకృష్ణ మోటమర్రి వెంకట బాబా ప్రసాద్ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మామిడి మురళీకృష్ణ మాట్లాడుతూ ఈనెల మూడవ తేదీ గురువారం ఉదయం గం.7-15 ని.లకు నిర్వహించే కలశస్థాపనలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ప్రతిరోజు శ్రీ పార్వతీదేవి, శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవార్లకు ప్రత్యేక అలంకారాలు చేస్తామన్నారు. ఉదయం అమ్మవార్లకు సహస్రనామ కుంకుమార్చనలు, నగరేశ్వర స్వామికి ఏకాదశి రుద్రాభిషేకాలు, సూర్య నమస్కారాలు, పంచాక్షరి, నవగ్రహ, బాలా త్రిపుర సుందరి, పంచదశ జపాలు జరుగుతాయన్నారు. కార్యదర్శి మోటమర్రి వెంకట బాబా ప్రసాద్ మాట్లాడుతూ ఉదయం సామూహిక కుంకుమార్చనలతోపాటు మన సంస్కృతిని ప్రతిబింబించే మాతృ అర్చన,లక్ష్మీ కుబేర అర్చన వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉపాధ్యక్షుడు సామా వెంకటలక్ష్మి కాంతారావు మాట్లాడుతూ ప్రతిరోజు సాయంత్రం సంగీత, నృత్య, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సహాయ కార్యదర్శి బైసాని హయగ్రీవరావు మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం సాయంత్రం అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి పునీతులు కావాలని కోరారు. ఈ సందర్భంగా ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఆలయ ప్రాంగణాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో కన్నుల పండుగగా అలంకరించారు.

# 594/1 సర్వే నెంబర్‌లో ఉన్న సమస్యను తీర్చాలని ఎండోమెంట్ జిల్లా అధికారిని కోరిన జేపసీ బృందం



**పెడన, మేజర్ న్యూస్ :** పట్టణంలో గల రెండు మూడు వాటిలలో ఉన్న 594/1 సర్వే నంబర్‌లో ఉన్న ఖాళీ స్థలాలు, ఇళ్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్ సమస్యలను ఆ సర్వే నంబర్ జేఏసీ బృందం కృష్ణాజిల్లా దేవధాయ ధర్మధాయ శాఖ జిల్లా అధికారి నూతక్కి వెంకట సాంబశివరావుని కోరారు. ఈ మేరకు దేవాదాయ ధర్మాదాయ శాఖ జిల్లా అధికారి వెంకట సాంబశివరావుని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఒక ప్రకటనలో మాట్లాడుతూ ఈ సర్వే నెంబర్లు ఇల్లు, ఖాళీ స్థలాలు రిజిస్ట్రేషన్లు జరగకపోవటం వల్ల ఎంతోమంది అనేక రకాల ఇబ్బందులకు గురయ్యారని అనేక రకాల సమస్యలు ఎదుర్కొన్నారని ఇప్పటికైనా తమ సమస్యను పరిష్కరించాలని కోరమన్నారు. ప్రభుత్వాల మారుతున్న ప్రజాప్రతినిధులు మారుతున్న తమ సమస్యను పరిష్కరించిన నాథుడే లేడని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం అధికారులు చేసిన తప్పుల వల్లే ఆ రెండు వార్డులలో ఉన్న ప్రజలందరూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తమ సమస్యని పరిష్కరించాలని ప్రాధేయ పడుతున్నామని పేర్కొన్నారు. అనంతరం జేఏసీ బృందం ఆధ్వర్యంలో దుశాలవతో ఆయనను ఘనంగా సన్మానించామని తెలిపారు. ఈ కార్యక్రమానికి శ్రీనివాస్ వీణం,కొలుకుల శ్యామ సుందరరావు, శింగరాజు ప్రకాష్, పట్టిసపు పవన్ కళ్యాణ్, తదితరులు ఉన్నారు.

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999

